క్లుప్తంగా

దాతల సాయంతో పాఠశాలకు పెయింటింగ్



స్కూల్ గోడలకు పెయింట్ వేస్తున్న దృశ్యం

గాజువాక : దాతల ఆర్థిక సాయంతో పాత గాజువాకలోని చిట్టినాయుడు కాలనీ ప్రాథమిక పాఠశాలకు రంగులు వేస్తున్నారు. స్థానిక దాత జీఎల్ ఎం.పురాణం, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ జి.అయ్యప్ప, వైస్ చైర్మన్ వి.ఏసు సహకారంతో పనులు చేపట్టినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మయి చెప్పారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు.

అనారోగ్యంతో ప్రిన్సిపాల్ మృతి



బెన్నుస్వామి (ఫైల్)

పెదగంట్యాడ : జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. బెన్నుస్వామి అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారు జామున అనకాపల్లిలోని తన నివాసంలో మృతి చెందారు.

31న కౌన్సెలింగ్

మధురవాడ : బక్కన్నపాలెంలో గల ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో 2024 – 25 విద్యా సంవత్సరానికి ఐటీఐ ట్రేడుల్లో పురుష దివ్యాంగ యువతను చేర్చుకునేందుకు మూడో దశ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 31న హాజరు కావాలని పీవో జె.మాధవి తెలిపారు. శిక్షణ కేంద్రంలో కార్పెంటర్ – 18, షీట్ మెటల్ వర్కర్ – 5, పెయింటర్ – 15 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ నేడు

గాజువాక : ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్, గాజువాక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌ను గాజువాకలో నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యాల కోటేశ్వరరావు తెలిపారు. అండర్–13 కేటగిరీలో ఓపెన్, బాలికల విభాగాల్లో ఈ పోటీలునిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పోటీలు జగ్గు జంక్షన్ సమీపంలోని లయన్స్ క్లబ్‌లో ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. వివరాలకు 7010319715 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

భవిత కేంద్రం పరిశీలన



వడ్లపూడిలోని భవిత కేంద్రంలో బాలలతో మాట్లాడుతున్న గీత

అగనంపూడి : గాజువాక మండల భవిత కేంద్రాన్ని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఐఈ కోఆర్డినేటర్ బి.గీత శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో బాలలకు సాగుతున్న బోధన తీరును పరిశీలించారు. నోట్ పుస్తకాలు పరిశీలించారు. ఏ మేరకు చదువులు సాగుతున్నాయో పరిశీలించారు. అనంతరం కేంద్రం రికార్డులు తనిఖీ చేశారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

పెదగంట్యాడ : జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బర్మా కాలనీలో వేంచేసిన దుర్గాదేవి అమ్మవారి ఆలయం శుక్రవారం భక్తులతో పోటెత్తింది. శ్రావణ శుక్రవారం మొదటి వారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

ఎవరి ఒత్తిళ్లతో ఈ మార్పులు..?

- ట్రాఫిక్ నియంత్రణ పేరుతో కొన్ని రోడ్ల మూసివేత
- గతంలో మూసేసిన మార్గాలు తెరవడంపై జనం విస్మయం
- అధికారులపై వ్యాపార, రాజకీయ వర్గాల ఒత్తిడిపై అనుమానాలు



శ్రీనగర్‌లో డి.మార్టు ఎదురుగా సర్వీస్ రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన సిమెంట్ స్టాపర్లు

గాజువాక : ట్రాఫిక్ నియంత్రణ పేరుతో అధికారులు చేపట్టిన చర్యలపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక రోడ్డు నుంచి మరో రోడ్‌లోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారులను మూసేసిన అధికారులు, గతంలో మూసేసిన వాటిని తెరిపించడం చర్చనీయాంశమైంది. ఈ చర్యల వెనుక ఎవరి ఒత్తిడి ఉందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వ్యాపారుల ఒత్తిడికి అధికారులు తలొగ్గారా..? రాజకీయ నాయకుల ప్రమేయం ఏమైనా ఉందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● స్థానిక విశ్వేశ్వరయ్యనగర్ కాలనీ నుంచి జాతీయ రహదారిపైకి వచ్చేందుకు గతంలోనే సర్వీసు రోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ రోడ్డు శ్రీనగర్ జంక్షన్‌కు అనుసంధానమై ఉంటుంది. సర్వీస్ రోడ్‌లో విశ్వేశ్వరయ్యనగర్ కాలనీతోపాటు రెండు ఫంక్షన్ హాళ్లు, డి.మార్ట్ సూపర్ మార్కెట్ ఉన్నాయి. దరిమిలా సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో సర్వీస్ రోడ్‌లో వన్‌వే ఏర్పాటు చేస్తే బాగుంటుందంటూ స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. దీనిపై ఇప్పటి వరకు స్పందించని అధికారులు ఇప్పుడు అకస్మాత్తుగా కార్లు, ఆటోల రాకపోకలను నిలిపివేస్తూ సర్వీస్ రోడ్‌కు అడ్డంగా సిమెంట్ స్టాపర్లను ఏర్పాటు చేశారు. దీంతో విశ్వేశ్వరయ్యనగర్ కాలనీ నుంచి ఎవరైనా కారులో గాజువాక వెళ్లాలంటే చుట్టూ 2 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

● కొత్త గాజువాక జంక్షన్‌లో బీసీ రోడ్ అప్రోచ్ వద్ద గతంలో మూసేసిన రోడ్‌ను ఇప్పుడు అధికారులు తెరిచారు. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండడంతో గతంలో దీన్ని మూసేశారు. దీన్ని తెరిపించాలంటూ కొంతమంది వ్యాపారులు అప్పట్లో అటు ప్రజాప్రతినిధులపై, ఇటు అధికారులపై ఒత్తిడి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే అప్పట్లో అధికారులు మాత్రం ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ చర్యలను అమలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన రెండు వారాలకే ఇక్కడి సిమెంట్ స్టాపర్లను తొలగించారు. దీంతో ట్రాఫిక్ మళ్లీ అస్తవ్యస్తంగా మారింది.

● కొత్త గాజువాక మెయిన్ రోడ్‌లో సింహగిరి ఆస్పత్రి వీధికి ఎదురుగా రోడ్ కటింగ్ ఉండేది. ఇప్పుడు దాన్ని మూసేసి దానికి పక్కనే మరో కటింగ్‌ను తెరిచారు. అంబులెన్స్‌లు వెళ్లడం కోసం అప్పట్లో అధికారులు ఈ ఆస్పత్రి ఎదురు వీధిలో మార్గం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దాన్ని మూసేసి పాత కటింగ్‌ను తెరిచారు. దీనివల్ల ఎవరికి ఉపయోగమని జనం ప్రశ్నిస్తున్నారు.

● గతంలో పాత గాజువాక జాతీయ రహదారిపై పద్మజ ఆస్పత్రి ఎదురుగా రోడ్డు దాటేందుకు వీలుగా రోడ్ కటింగ్ ఉండేది. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని దాన్ని చాలా ఏళ్ల క్రితం మూసేశారు. అయితే, రోడ్డు దాటడానికి వీలుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదన వచ్చింది. దాని కోసం పిల్లర్లు వేసి కూడా ఆపేశారు. దాన్ని తెరవాలని జనం అడుగుతున్నా ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించడం లేదు. అలాగే పంతులు గారి మేడ, చట్టివానిపాలెం జాతీయ రహదారిపై కూడా మార్గాలను గతంలోనే మూసేశారు. ట్రాఫిక్ విషయంలో ఇంత కఠినంగా ఉన్న అధికారులు కొన్ని చోట్ల అగమేఘాలపై ఎందుకు తెరిచారు.., మరికొన్ని చోట్ల ఎందుకు మూసేశారు..? అన్నది ప్రశ్నార్థకంగా మారిపోయింది.



గాజువాక షాపింగ్ మాల్స్ జంక్షన్‌లో రోడ్ కటింగ్ తెరిచిన తర్వాత ఇలా..



పాతగాజువాక హైవేపై సిమెంట్ స్టాపర్ల పైనుంచి రోడ్డు దాటుతున్న జనం

ఉక్కు దీక్షలకు ఆదివాసీల సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న ఆదివాసీ మహిళలు

అగనంపూడి : ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులు ప్రైవేటీకరించడాన్ని ఆదివాసీ సమాజం వ్యతిరేకిస్తుందని ఆదివాసీ సంఘ నాయకులు కె.పరంధామయ్య, కె.శ్రీనివాసనాయుడు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1275వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆదివాసీ మహిళలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలు అంటే ప్రజల సొత్తు అని, వాటిని అప్పనంగా ప్రైవేటుకు అప్పగించడం సరికాదన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మహిళలు దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలపడంతో పాటు థింసా నృత్యం చేశారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, పి.డేవిడ్, జె.రీపోతుల ముత్యాలు, వరసాల శ్రీనివాసరావు, ఎం.మహాలక్ష్మినాయుడు, రామ్‌కుమార్, దానబోయిపాలేనికి చెందిన నవోదయ మహిళా సంఘం, కొండయ్యవలస అంబేడ్కర్ సేవా సంఘం, మహాత్మా జ్యోతీరావుపూలే సంక్షేమ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా డీపీఎస్ విద్యార్థుల పట్టాభిషేక వేడుక



విద్యార్థులతో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే, ప్రిన్సిపాల్ పాండే

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో శుక్రవారం విద్యార్థుల పట్టాభిషేక వేడుక, వార్షిక అవార్డు ప్రదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో 340 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు టాపర్, నూరు శాతం హాజరైనందుకు సర్టిఫికెట్లు, టైలు, బ్యాడ్జీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) సురేష్ చంద్ర పాండే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఉత్తమ జోనల్ టీచర్ అవార్డు గ్రహీతలు వి.డి. శశిప్రభ, పి. రాజ్యలక్ష్మిలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రో వైస్ చైర్మన్ ఎస్.వి.ఎస్. రాజు, ఎల్ఎంసీ సభ్యులు లీలా శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ సమీర్ కుమార్ పాండే, కేవీ ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, డీపాల్ ప్రిన్సిపాల్ అనీష్ మాథ్యూ, శివశివానీ పాఠశాల ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును గట్టెక్కించండి

- కేంద్ర ఉక్కు సహాయ మంత్రికి సీ నాయకుల వినతి



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రస్తుత గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కించడానికి తక్షణం సాయం చేయాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కోరారు. శుక్రవారం సీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్ న్యూఢిల్లీలో మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ముడి పదార్థాల కొరత వల్ల ఉన్న రెండు ఫర్నేస్‌లను కూడా నడపలేని పరిస్థితికి వచ్చిందన్నారు. కేంద్రం స్పందించకపోతే స్టీల్‌ప్లాంట్ పూర్తిగా మునిగిపోతుందన్నారు. తక్షణ సాయంగా ఎన్ఎండీసీ కిరండోల్, బచేలీ గనుల నుంచి ప్రతిరోజు ఆరు రేకులు ఇనుప ఖనిజం సరఫరా చేయాలని, కనీసం ఆరు నెలల పాటు ఎన్ఎండీసీ నుంచి క్రెడిట్ ఫెసిలిటీ ఇప్పించాలని కోరారు. అదే విధంగా ఎన్ఎండీసీకి 1167 ఎకరాల భూమి లీజుకు ఇచ్చి బదులుగా రూ. 1500 కోట్ల ఆర్థిక సాయం చేయించాలని, బ్యాంకుల నుంచి వర్కింగ్ క్యాపిటల్ రూ. 3 వేల కోట్లు అప్పు ఇప్పించే విధంగా కేంద్ర ఆర్థిక శాఖ నుంచి లెటర్ ఆఫ్ కంఫర్ట్ ఇప్పించాలన్నారు. గతంలో వాజ్‌పాయ్ ప్రభుత్వం ఇచ్చినట్టుగా రూ. 3100 కోట్లు ప్రిఫరెన్షియల్ షేర్లుగా ఇప్పించాలని, సెయిల్ నుంచి కోకింగ్ కోల్ అప్పుగా ఇప్పించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా సెయిల్‌లో ప్లాంట్‌ను విలీనం చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న దువ్వాడ సీఐ ఎర్రం నాయుడు

అగనంపూడి : ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని దువ్వాడ సీఐ వావిలిపల్లి ఎర్రంనాయుడు అన్నారు. కూర్మన్నపాలెంలోని ఒక జూనియర్ కళాశాలలో ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జూనియర్ కళాశాలల సంఖ్య పెరిగిందని, అలాగే విద్యా సంస్థలు ఒకే చోట కేంద్రీకృతం కావడంతో పలువురు ఆకతాయిలు బాలికలను మానసికంగా వేధించడం, వెకిలి చేష్టలతో హింసిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో ఇటీవల ఒక కళాశాల విద్యార్థులు రెచ్చిపోయి ప్రవర్తించిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థులు జాగ్రత్తగా ఉండకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. మద్యం, సిగరెట్లు తాగడం విద్యార్థులు ఫ్యాషన్‌గా భావిస్తున్నారని, వ్యసనాలకు అలవాటు పడిన కొంతమంది గంజాయి తరలింపులో పాల్గొంటున్నారని, ఇది జీవితాలను నాశనం చేస్తుందని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



సేవా పురస్కారాలతో సత్కరిస్తున్న తహసీల్దార్ శ్రీవల్లి, సీఐ దాలిబాబు తదితరులు

పెదగంట్యాడ : ఆర్కా ఫౌండేషన్ 3వ వార్షికోత్సవాన్ని జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ దాలిబాబు హాజరయ్యారు. ఇటీవల తండ్రి మరణించిన మనోజ్ అనే విద్యార్థికి రూ.5 వేలు నగదు అందజేశారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సరస్వతి ప్రతిభ అవార్డులను అందజేశారు. వివిధ రంగాల్లో సేవలు చేసిన పలువురిని సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్కా ఫౌండేషన్ సేవలను కొనియాడారు కార్యక్రమంలో గూడూరు సీతామహాలక్ష్మి, డాక్టర్ హేమలత, వినోద్‌బాబు, వి.వి.ఎస్ సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు



ఉక్కు త్రిశక్తి దేవాలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఉక్కునగరం : స్థానిక త్రిశక్తి దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాస పూజలు ఘనంగా జరిగాయి. మొదటి శుక్రవారం సందర్భంగా శ్రీమహాలక్ష్మి అమ్మవారికి వేకువ ఝామున గోత్ర నామార్చన నిర్వహించారు. శ్రీమహా దుర్గాదేవికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో శ్రీమహాలక్ష్మికి సామూహిక కుంకుమార్చన, సహస్ర గులాబీ పుష్పార్చన చేశారు. అనంతరం అమ్మవారికి దీప, నక్షత్ర హారతులు అందజేశారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉక్కునగరం చిన్మయ మిషన్, గౌరీ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి పూజ చేశారు. వడ్లపూడి శ్రీగౌరీ రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 300 మంది మహిళలు పాల్గొని సామూహిక కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ రెసిడెంట్ ఆచార్య రఘువీరానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ తిరుమల బాలాజీ క్షేత్రంలో శ్రావణం పూజలు

అక్కిరెడ్డిపాలెం : షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రీ పద్మావతి అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. దివ్యక్షేత్రంలో మహిళలు సామూహిక లక్ష్మీ సహస్రనామార్చన, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

వైభవంగా కలశ ప్రతిష్ట పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, తదితరులు

అగనంపూడి : జీవీఎంసీ 87వ వార్డు కణితి కాళింగ వీధి గాంధీ బొమ్మ సెంటర్‌లోని శ్రీపంచముఖేశ్వరస్వామి ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్ట పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బ్రహ్మకపాలం మూసివేతకు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా నవరత్నాలు, ధాన్యం, స్వర్ణ రత్నాలు వేయించి పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు పల్లా కార్తీక్, ప్రగడ వేణుబాబు, శ్రీనివాసరావు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, సాగి విజయరామరాజు, ప్రగడ శంకరరావు పాల్గొని నవరత్నాలు, స్వర్ణ రత్నాలు వేసి విశేష పూజలు నిర్వహించారు.

పెండింగ్ చలానాల వసూలుకు స్పెషల్ డ్రైవ్



పాత గాజువాక జంక్షన్‌లో ద్విచక్ర వాహనదారుల నుంచి చలానాలు వసూలు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

గాజువాక : ద్విచక్ర వాహనదారుల నుంచి పెండింగ్ చలానాల వసూలుకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించడం వంటి కారణాలతో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, వాహనదారులు వివిధ కారణాల రీత్యా చలానాలు చెల్లించడం లేదు. తమ వాహనంపై కేసు నమోదైన విషయం తెలియక కొందరు, కేసు విషయం తెలిసినా తర్వాత చూద్దాంలే అని మరికొందరు.. ఇలా చలానాలను పెండింగ్‌లో ఉంచేస్తున్నారు. దీనిపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు పెండింగ్ చలానాలు వసూలు చేయాలని ఆదేశించడంతో గాజువాకలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు నేతృత్వంలో ఎస్ఐలు, సిబ్బంది ఎక్కడికక్కడ వాహనాలు ఆపి చలానాలు వసూలు చేశారు.

ఉక్కు కోఆపరేటివ్ స్టోర్స్ నూతన కార్యవర్గం



నూకరాజు



నాగబాబు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2021 డిసెంబర్ 30న జరిగిన ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీకి చెందిన బి.టి.జగదీష్, ఆకుల నూకరాజు, ఏఐటీయూసీకి చెందిన గంట్ల నాగభూషణం, డి.వి.నాగబాబు, సీఐటీయూకు చెందిన ఎ.వి.ఎస్.సత్యనారాయణ, లోకేష్ డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ మధ్య జరిగిన అవగాహన మేరకు ప్రధాన పోస్టులు రెండున్నరేళ్లు చొప్పున నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఇప్పటి వరకు బి.టి.జగదీష్ అధ్యక్షునిగా, జి.నాగభూషణం కార్యదర్శిగా, ఆకుల నూకరాజు ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. రెండున్నరేళ్లు పూర్తి కావడంతో ప్రస్తుతం అధ్యక్షునిగా నాగబాబు, కార్యదర్శిగా నూకరాజు, ఉపాధ్యక్షునిగా నాగభూషణం బాధ్యతలు చేపట్టారు. ఐఎన్‌టీయూసీకి చెందిన జగదీష్, సీఐటీయూకు చెందిన ఎ.వి.ఎస్.సత్యనారాయణ, లోకేష్ డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు.

ఆదివాసీలకు గుర్తింపునివ్వాలి



ఆదివాసీ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న సంఘం సభ్యులు

పెదగంట్యాడ : ఆదివాసీలపై కపట ప్రేమ చూపిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి భారత స్వాతంత్య్ర పోరాట చరిత్రలో గుర్తింపునివ్వాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావు అన్నారు. అంతార్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక భానోజీకాలనీలో గాం గంటం దొర, మల్లు దొరల సేవా సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు శివంగి నాగేశ్వరరావు అధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పితూరిలో ఆదివాసీలు 2 వేల మంది వరకూ మరణించారని, 30 మంది వరకు యావజ్జీవ ఖైదు విధించబడి అండమాన్ జైలుకు పంపబడ్డారన్నారు. వారెవరి పేర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచురించిన చరిత్ర పుస్తకాల్లో ముద్రించలేదని ఆరోపించారు. అల్లూరి పితూరిలో పని చేసిన ఆదివాసీలపై సమగ్ర పరిశోధన చేసి వారి పేర్లను వెలుగులోకి తీసుకొచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. గిరిజనులకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ సేవా సంఘం స్థాపించామన్నారు. విశాఖ తొలి పార్లమెంట్ సభ్యునిగా పని చేసిన గాం మల్లు దొర విగ్రహాన్ని విశాఖ బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసేందుకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును అనుమతి ఇప్పించాలని కోరామన్నారు. దీనికి ఆయన అంగీకరించారన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అల్లూరి గాం గంటం, మల్లుదొరల సేవా సంఘం ఉపాధ్యక్షుడు పోతిన వెంకటేశ్వరరావు, నాయకులు రట్టివాసు, కర్రి కృష్ణ, మంగ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జీఎం మధుసూదనరావు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ డీఏవీ పాఠశాలలో శుక్రవారం అంతర పాఠశాలల క్రీడా దినోత్సవం ఉత్సాహంగా జరిగింది. పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో డీఏవీ సౌత్ జోన్–ఎ క్లస్టర్–1కి చెందిన ఒనక ఢిల్లీ, పాలకొండ, రాజాం, అనకాపల్లి, బుచ్చిరాజుపాలెం, సుజాతా నగర్, కొవ్వూరు, ఉక్కునగరం పాఠశాలలకు చెందిన సుమారు 360 మంది బాలబాలికలు పాల్గొన్నారు. బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చదరంగంతో పాటు అథ్లెటిక్స్‌లోని వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ వెల్ఫేర్ విభాగం జీఎం ఎం. మధుసూదనరావు ముఖ్య అతిథిగా, ఫైనాన్స్ డీజీఎం కె. వేణుగోపాల్ అతిథిగా పాల్గొన్నారు. మధుసూదనరావు మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందుతాయన్నారు. గెలుపోటములు చూడకుండా ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకర్ బసవ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంక్యుబేషన్ టెక్నాలజీతో అద్భుత ఫలితాలు

అగనంపూడి : వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికరంగ నిపుణుల మధ్య అంతరాలను తగ్గించడంలో ఇంక్యుబేషన్ టెక్నాలజీ దోహదపడుతుందని విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అబ్దుల్ రియాజ్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో భారతదేశంలో ఇంక్యుబేషన్ టెక్నాలజీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక ఇంక్యుబేషన్ పరిణామం, ప్రస్తుత పరిస్థితులు, మౌలిక వసతులపై వివరించారు. ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, కోఆర్డినేటర్ కనకమహాలక్ష్మి, ఎం.శ్రీను పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి అనగాని

విశాఖ సిటీ: జిల్లాలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయా జిల్లాలకు పతాకావిష్కరణ నిమిత్తం మంత్రులను నామినేట్ చేస్తూ రాష్ట్ర పరిపాలనా విభాగం శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విశాఖపట్నం జిల్లాకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నామినేట్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంటూ జిల్లా కలెక్టర్ ఏర్పాట్లు చేయాలని సూచించింది.

వసతుల కల్పనతోనే సమర్థంగా విధుల నిర్వహణ

విశాఖ సిటీ: పోలీస్ సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పిస్తే సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో సిబ్బందికి నూతన కిట్‌బాక్సులు అందజేశారు. అలాగే సిబ్బంది కోసం నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రాంగణం సందర్శించిన ఆయన దృష్టికి సిబ్బంది పలు సమస్యలు తీసుకెళ్లారు. వారి వినతుల మేరకు మొదటి ప్రాధాన్యతగా కొత్త కిట్ బాక్స్‌లు అందజేత, మరుగుదొడ్ల పునర్నిర్మించి ప్రారంభించడం, కొత్త హ్యాండ్ కఫ్స్ మంజూరు చేసి సిబ్బందికి అందజేశారు. సీపీకి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.